క్లుప్తంగా

మున్సిపల్ మేనేజర్‌గా ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ



పెడన: పెడన మున్సిపల్ మేనేజర్‌గా ఎంఆర్‌వీ ఆర్ ప్రసాద్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన నిడదవోలు పురపాలక సంఘంలో రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పెడన పురపాలక సంఘానికి వచ్చారు. అంతకు ముందు పనిచేసిన యోగేశ్వరరావు పదవీ విరమణ చేసి ఐదు నెలలు కావడంతో అప్పటి నుంచి మేనేజర్ పోస్టు ఖాళీగా ఉంది. ప్రసాద్ రాకతో ఆ పోస్టు భర్తీ అయింది. మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన బి.వెంకటరామయ్యను నగరి మున్సిపల్ కార్యాలంయలో రెవెన్యూ అధికారిగా నియమించారు.

అడ్డు కట్టలు తీయకపోతే ఎలా?



కృత్తివెన్ను: పంట పొలాలు మునిగిపోతున్నా రొయ్యలు, చేపలు కోసం వేసిన అడ్డుకట్టలు తీయకుండా రైతులను మరిన్ని కష్టాలు పాలు చేయడం ఎంత వరకు సమంజసమని సీపీఎం జిల్లా నాయకులు మాజేటి శ్రీనివాసరావు, మత్స్యకార రాష్ట్ర నాయకులు కొల్లాటి శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని మునిపెడ, యండపల్లి, సీతనపల్లి, నీలిపూడి గ్రామాల్లో నీటమునిగిన పంట పొలాలను గురువారం పరిశీలించారు. నీలిపూడి డ్రెయిన్‌పై కొందరు వ్యక్తులు ఏర్పాటు చేసిన రొయ్యల కట్లు వల్ల నీటి ప్రవాహం సాగడం లేదని చేలల్లో నీరు బయటకు పోవడం లేదన్నారు. అధికారులు పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. ఒకవైపు పంటపొలాలు మునిగిపోయి వరి కుళ్లిపోతున్నా అడ్డుకట్టలను తొలగించకుండా తాత్సార్యం చేయడంపై వారు ఫిషరీస్, డ్రైనేజీ, అగ్రికల్చరల్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

నాగాయలంక: కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్, ఏటిమొగ-ఎదురుమొండి పంటు ప్లాట్‌ఫారం ఘాట్‌లలో బురద, చెత్తాచెదారం తొలగింపు పనుల్లో పారిశుధ్య కార్మికులు శ్రమిస్తున్నారు. వరద నీటి మట్టం పూర్తిగా తగ్గిపోవడంతో పంచాయతీల అధికారులు శానిటేషన్ పనులు చేపట్టారు. ఘాట్‌లపై పెద్ద ఎత్తున ఒండ్రు మట్టి పేరుకు పోయింది. దీంతో పాటు కొట్టుకొచ్చిన వ్యర్థాలు, చెత్తతో పరిసరాలు తెట్టు కట్టాయి. ఈవోపీఆర్డీ కె.అప్పలనరసమ్మ పర్యవేక్షణలో కార్యదర్శులు జె.హెచ్.వి.పవన్‌కుమార్, పి.మల్లికార్జునరావు, సిబ్బంది శానిటేషన్ పనులు చేస్తున్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా మచిలీపట్నం నగరంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ ఎం.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. గొడుగుపేట, చెమ్మనగిరిపేట, విజయవాడ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

బియ్యం, కందిపప్పు పంపిణీ

అవనిగడ్డ:మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక, రామచంద్రపురం పంచాయితీ పరిధిలో నివశిస్తున్న వరద బాధిత ఎస్టీలకు పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ బియ్యం, కందిపప్పుని అందించారు. పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. అనంతరం రక్షిత మంచినీటి మోటార్లు మరమ్మతుకు గురైన విషయాన్ని కొంతమంది స్థానికులు విక్కుర్తి శ్రీనివాస్ దృష్టికి తీసుకురాగా వాటికి మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.

కూలుతున్న పూరిళ్లు

గూడూరు: పోసినవారిపాలెం శివారు పాట్లేలు గుంటాయిపేటలో వెంకన్నకు చెందిన పూరిపాక పూర్తిగా కూలిపోయింది. కలపటంలో బడుగు ప్రభుదాసుకు చెందిన తాటాకు ఇంటితో పాటుగా ఆకులమన్నాడుకు చెందిన గూడపాటి లక్ష్మి ఇంటి గోడలు కూలిపోయాయి. బాధితులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

పర్ణశాలలో ఉద్రిక్తత

గూడూరు:తరకటూరు శివారు పర్ణశాల దగ్గర చేపట్టిన కాల్వలోని తూడు తొలగింపు చర్యలు ఉద్రిక్తతకు దారితీశాయి. ఎగువ ప్రాంతాల్లోని నీరు పోయేందుకు అధికారులు గత నాలుగు రోజులుగా కాల్వల్లో పేరుకు పోయిన గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టారు. తరకటూరు, ఎగువ ప్రాంతాల్లో వరద నీరు కిందికి పోకుండా పర్ణశాల సమీపంలో ఉన్న అడ్డంకులను అధికారులు గుర్తించారు. వీటిని తొలగిస్తే ఎగువ ప్రాంతంలోని నీరు కిందకు పోతుందన్న ఆలోచనతో అడ్డుగా ఉన్న గట్లను తొలగించే పనులు గురువారం చేపట్టారు. విషయం తెలుసుకున్న దిగువున ఉన్న తరకటూరుపాలెం రైతులు దీనికి అభ్యంతరం తెలుపుతూ పనులను అడ్డుకున్నారు. దిగువున కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు తొలగించకుండా ఎగువ నుంచి పనులు చేసుకుంటూ వస్తే దిగువున ఉన్న తమ పొలాలు మునిగిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ముంపు ముప్పులోనే..!

- నీటిలోనే పొలాలు.. వీధులు
- ఎప్పటికి పోతాయో.. పనులెప్పుడు చేపట్టాలో తెలియని పరిస్థితి
- పట్టణంలో స్తంభించిన కలంకారీ కుటీర పరిశ్రమ
- ఆగిన మగ్గం పనులు



పెడన- మచిలీపట్నం ప్రధాన రహదారిలో నిలిచిన వర్షం నీరు

పెడన: భారీ వర్షాలకు పట్టణంలోని వీధులు ఇంకా ముంపులోనే ఉన్నాయి. నీరు బయటకు పోకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే స్తంభించాయి. కలంకారి పరిశ్రమకు పేరుగాంచిన పెడన పట్టణంలో చాలా చోట్ల కలంకారీ కుటీర పరిశ్రమలకు మూతపడ్డాయి. వర్షం నీరు చేరి వెళ్లడానికి ఇబ్బందులు పడుతుండటంతో ఏకంగా వాటిని తాత్కాలికంగా మూసి వేశారు. ముంపులోనే కాలనీలుండటంతో నిత్యం రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క రైతులు తమ పంట పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపించే మార్గలను అన్వేషించి మురుగుబోదెల్లో అడ్డుగా ఉన్న తూడు, గుర్రపు డెక్కను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. వీరభద్రపురం, మొగ్గయ్య కాలనీ, రామలక్ష్మీవీవర్స్ కాలనీ, బల్లిపర్రు కాలనీ, శింగరాయపాలెం కాలనీ, వైఎస్సార్ కాలనీ తదితర ప్రాంతాల్లోని వీధుల్లో నీరు నిలిచి బయటకు పోని దుస్థితి ఏర్పడింది. పురపాలక సంఘం అక్కడక్కడ అయిల్ ఇంజిన్లను పెట్టి నీటిని తోడిస్తున్నారు. పెడన తోటమూల ప్రాంతంలోని పంట పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆ నీటిని మురుగుబోదె ద్వారా బయటకు పంపించేందుకు రైతులు స్వచ్ఛందంగా కదిలి తూడు తొలగించుకుంటున్నారు.



వర్షాలకు పెడనలోని వీరభద్రపురంలో నిలిచిన కలంకారి కుటీర పరిశ్రమ

తూడు తొలగించుకుంటున్నాం

పెడన తోటమూల ప్రాంతంలో పొలం ఉంది. పరిసర రైతులంతా కలిసి ముంపులో నీటిని బయటకు పంపించేందుకు మూడు రోజులుగా చర్చలు జరిపి తూడు తొలగించుకుంటున్నాం. కొందరు రైతులు స్వయంగా రంగంలోకి దిగారు. మరికొందరు కూలీలను పంపించారు. తామర చెరువు నుంచి కొంకేపూడి డ్రెయిన్‌లో కలిసే మురుగుబోదెలో తూడు, గుర్రపు డెక్క తొలగించకుంటున్నాం.

– వరుదు కనకారావు, రైతు, తోటమూల



పెడనలో ఆగిన మగ్గాన్ని సరి చేసుకుంటున్న నేత కార్మికుడు



పెడన తోటమూల ప్రాంతంలో ముంపులో పంట పొలాలు



మురుగుబోదెలో అడ్డుగా ఉన్న తూడు తొలగించుకుంటున్న రైతులు, కూలీలు

నగరంలో మంత్రి కొల్లు పర్యటన

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు కాలనీల్లో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర గురువారం పర్యటించారు. భారీ వర్షాలకు నగరంలోని సుందరయ్యనగర్, డ్రైవర్స్‌కాలనీ, గుమాస్తాలకాలనీలు జలమయమయ్యాయి. ముంపు తొలగిన అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర ఈ కాలనీల్లో పర్యటించారు. సుందరయ్యనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా నగరంలోని పలు కాలనీలు ముంపుబారిన పడ్డాయన్నారు. ఆయా ప్రాంతాల్లో నీటిని యుద్ధప్రాతిపదికన తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలో ముంపు సమస్య రెండు, మూడు రోజుల్లో తగ్గేలా చర్యలు తీసుకుంటామన్నారు. బలహీనంగా ఉన్న శివగంగ డ్రెయిన్ కట్టను పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీల్లో డ్రెయిన్లు నిర్మించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ఇళ్ల లెక్కలు సేకరించటం జరుగుతోందన్నారు. వరద ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, లీటరు పామాయిల్, కిలో చక్కెర, రెండు కిలోల ఉల్లిపాయలు, బంగాళదుంపలు పంపిణీ చేస్తామన్నారు. మాజీ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్, కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



ముంపు తగ్గిన ప్రాంతాల్లో ప్రజలను పలుకరిస్తున్న మంత్రి రవీంద్ర

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



మోపిదేవి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం చేస్తున్న జిల్లా కలెక్టర్, డీఈవో

మోపిదేవి:మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కె. వీరరవి, పి. జయంతిలకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రసంశాపత్రాలు అందించి మెమెంటోతో సత్కరించారు. మచిలీపట్నంలో గురుపూజోత్సవం సందర్భంగా గురువారం ఉపాధ్యాయులను సత్కరించారు. వీర రవి మోపిదేవి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తుండగా, జయంతి స్థానిక జెడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా కొనసాగుతున్నారు. డీఈవో తాహెరా సుల్తానా, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, పలువురు అధికారులు, ఉపాధ్యాయులను అభినందించిన వారిలో ఉన్నారు.

చేనేత కార్మికుల ఆకలికేకలు

- వరదనీటితో ఆగిన మగ్గం
- ఉపాధి కోల్పోయి అవస్థలు
- ఆదుకోవాలని వినతి

ఘంటసాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుంత మగ్గాల్లోకి వరద నీరు చేరడంతో మగ్గాలు ఆగిపోగా కార్మికులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. ఘంటసాల గ్రామంలో చేనేత వృత్తి పై ఆధారపడి సుమారు 450 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లడంతో గోటకం కాలనీల్లో వర్షపు నీరు చేరి ఇళ్లల్లోకి ప్రవేశించాయి. దీంతో చేనేత కార్మికులు పని చేసుకునే గుంతల్లో వరద నీరు చేరడంతో ఉపాధి కోల్పోయారు. మగ్గం గుంతలో చేరిన నీరు పోయి నేతకు సిద్ధం అవ్వాలంటే అదీ వాతావరణం అనుకూలిస్తే 10 నుంచి 15 రోజులు పడుతుందని, లేకుంటే 20 రోజుల పైనే పడుతుందని చేనేత కార్మికులు అంటున్నారు. కేవలం చేనేత వృత్తి పై ఆధారపడి జీవిస్తున్న ఆయా కుటుంబాల వారు పని లేక ఇళ్లల్లో ఉన్న కొద్దోగొప్పో సరుకులతో ఇప్పటి వరకు జీవనం సాగించారు. పూర్తిస్థాయిలో ఉపాధి కోల్పోవడంతో తింటానికి తిండి లేక, మగ్గాలు పని చేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేనేత మగ్గం పని చేస్తే దాని పై చిలపలు చేసే వారు, పొడుగుతోడే (అను)వారు, పొడుగు చేసే వారు, అచ్చు అతికి మొలపెట్టేవారు ఇలా నలుగురు, ఐదుగురు ఆధారపడి జీవనం సాగుతుందన్నారు. మగ్గాలు పని చేయకపోవడంతో ఉప వృత్తుల వారు కూడా జీవనోపాధి కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. భారీ వర్షాలకు ఇంతలా ఇబ్బందులు పడుతుంటే మా వైపు చూసిన నాథుడే లేడంటూ చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఘంటసాల మండలంలోని చేనేత కార్మికులకు తక్షణసాయంతో నిత్యావసర వస్తువులతో పాటు కొంత నగదు అందించాలని విన్నవించుకుంటున్నారు.



గోటకంలో లక్ష్మి నేస్తున్న చేనేత మగ్గంలోకి చేరిన వర్షపు నీరు



భారీ వర్షాలకు నిలిచిపోయిన మగ్గాన్ని చూపుతున్న అన్నపూర్ణ దంపతులు

జీవనోపాధి కోల్పోయాం



భారీ వర్షాలకు మా ఇంటి పక్కనే ఉన్న చెరువులోని నీరు ఉప్పొంగడంతో మగ్గం గుంతలోకి నీరు చేరింది. దీంతో మగ్గం నేయకపోవడంతో ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. నేను, మా ఆయన ఈ వృత్తి పైనే ఆధారపడి జీవిస్తున్నాము. ఇప్పుడు ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం మా చేనేత కార్మికులను ఆదుకోవాలి.

– ఆకురాతి అన్నపూర్ణ, చేనేత కార్మికురాలు, ఘంటసాల

మగ్గం నేస్తేనే జీవనం గడిచేది



భార్యాభర్తలం ఇద్దరం చేనేత వృత్తి పై ఆధారపడి జీవిస్తున్నాము. సుమారు 10 రోజల నుంచి మగ్గాలకు పని లేక ఇబ్బందులు పడుతున్నాము. వరద నీరు మగ్గాల్లోని గుంతల్లోకి వచ్చి మూలిగే నక్క పై తాటికాయ పడినట్లయింది. తినడానికి, మందులు తెచ్చుకోవడానికి డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదుకోవాలని కోరుతున్నాము.

– తేలప్రోలు లక్ష్మీ నారాయణ, చేనేత కార్మికుడు

బతికేందుకు సాయం చేయండి



భర్త చనిపోవడంతో చేనేత వృత్తి పైనే ఆధారపడి జీవిస్తున్నాను. భారీ వర్షాలకు మగ్గం గుంతలోకి నీరు చేరడంతో ఉపాధి కోల్పోయాను. తినడానికి తిండి లేక, వేరే పని చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం మా పై దయవుంచి బతికేందుకు సాయం చేయాలి.

–మిర్యాల లక్ష్మీ, చేనేత కార్మికురాలు, గోటకం

వరద బాధితులకు అందరూ చేయూతనివ్వాలి



కె. కొత్తపాలెంలో బాధితులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ద ప్రసాద్



బాధితులకు ఆహారం పంపిణీ చేస్తున్న మోపిదేవి దేవస్థానం అధికారులు

అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ద ప్రసాద్

కె. కొత్తపాలెం(మోపిదేవి): వరద భీభత్సానికి సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వంతో పాటు సేవా సంస్థలు, ట్రస్టులు తమ వంతు సాయం చేసి ఆదుకోవాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్దప్రసాద్ కోరారు. మండలంలోని కె. కొత్తపాలెంలో కడప జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అందించిన నూతన దుస్తులు గురువారం వరద బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగా పనిచేసి ప్రాణనష్టం కాకుండా కాపాడగలిగామని తెలిపారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నుంచి వెజ్ బిర్యానీ, పులిహోర, వాటర్ ప్యాకెట్లు అందించినట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరావు పేర్కొన్నారు. అవనిగడ్డ, కె. కొత్తపాలెం, బొబ్బర్లంక వంటి వరద బాధితులకు అందచేసినట్లు చెప్పారు. కె కొత్తపాలెం గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాదవి, కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, రావి రత్నగిరి, ఆలయ అధికారులు పాల్గొన్నారు. వెంకటాపురంలో దైవసేవకులు కొంగర ఇమ్మానియోల్ ఆధ్వర్యంలో గొరిపర్తి వేణుగోపాలకృష్ణ నిత్యావసర సరుకులు, బియ్యం అందించారు. కొక్కిలిగడ్డ పునరావాస కేంద్రంలో వరద బాధితులకు రావివారిపాలెంకు చెందిన రావి సుధాకరరెడ్డి, సౌదామణి దంపతులు పండ్లు పంపిణీ చేశారు. కోసూరువారిపాలెంలో ఎస్టీలకు సనకా ప్రవీణ నూతన వస్త్రాలు అందించి తమ వంతు చేయూత నిచ్చారు.

ప్రసన్న గణపతి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ఉత్సవ పందిరి, ప్రసన్నగణపతి దేవస్థానం (ఇన్‌సెట్‌లో స్వామివారు)

నాగాయలంక: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన నాగాయలంక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో 67వ వినాయక నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో 15 రోజులు నిర్వహించే ఉత్సవాలకు గత వారం రోజుల నుంచి భారీ పందిరి నిర్మాణం, ఉత్సవ విగ్రహ వేదిక, చాందినీ అలంకారం తదితర పనులు పూర్తి చేశారు. 7వతేదీ శనివారం శాస్త్రోక్తంగా స్వామివారి 12 అడుగుల ఉత్సవ విగ్రహం మందిర ప్రవేశంతో వార్షిక ఉత్సవాలకు శ్రీకారం చుడతామని కమిటీ ప్రతినిధులు చెప్పారు. ఈ నెల 22వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలను గత ఆనవాయితీ ప్రకారం అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ప్రారంభిస్తారు. 15రోజులకు పైగా ప్రతి పగలు, రాత్రి వేళల్లో నిత్యం హరికథలు (మధ్యాహ్న సమయం), బుర్రకథలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, కోలాటం, భజనలు జరుగుతాయని ఉత్సవ కమిటీ వర్గాలు వెల్లడించాయి. నిమజ్జనం తదుపరి ఉత్సవాల ముగింపు రోజుల్లో సాంఘిక, పౌరాణిక, జానపద నాటకాల ప్రదర్శన ఉంటుంది. సంస్కృతీ సాంప్రదాయాల పరిరక్షణ నేపథ్యంలో 67 ఏళ్లుగా క్రమం తప్పకుండా ప్రత్యేక పక్కా పందిరి నిర్మాణంతో నిర్వహిస్తున్న ప్రసన్న గణపతి ఉత్సవాలు, 200 మందికి పైగా మహిళలతో జరిపే సామూహిక కుంకుమ పూజ జిల్లాలోనే ప్రసిద్ధి కలిగి ఉన్నాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఈ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వార్షిక ఉత్సవాలను జయప్రదం చేయాలని దేవస్థానం కమిటీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా గురుపూజోత్సవం



రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎలక్ట్రికల్ ఈఈ భాస్కరరావు

మచిలీపట్నంటౌన్: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నగరంలోని పలు పాఠశాలలు, సంస్థల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో రాధాకృష్ణ చిత్రపటానికి ఈఈ ఎం.భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అజ్మీర్‌బాబా దర్గా సేవా సమాజంలో రాధాకృష్ణను స్మరించుకున్నారు. వైజ్‌మెన్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్‌పీర్ రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రజాతీయ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు మేడిచర్ల ఆంజనేయశాస్త్రిని ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు దుర్గారావు, షేర్ అలీ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు (జానీ) ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయుడు గంట్రపు శీనయ్యమాష్టార్ ను ఘనంగా సత్కరించారు. దళిత జేఏసీ నాయకులు వంపుగడవల చౌదరి, అరిగెల సురేష్‌కుమార్, ముప్పిడి కోటేశ్వరరావు, మోడీ తాతయ్య, లాల్ బహద్దూర్‌శాస్త్రి, మాజీ జీపీ గుమ్మడి సుబ్బారావు, డీసీసీ కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ దగాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అవనిగడ్డ:గోస్పెల్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ పాతూరి సంగీతరావు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు దేవరపల్లి సురేష్‌బాబుని సత్కరించారు. సంఘం కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో సంగీతరావు మాట్లాడారు. సంఘం నేతలు సుబ్బారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. కోడూరులో జరిగిన కార్యక్రమంలో అవార్డులు వచ్చిన పాలకాయతిప్ప ఎంపీయూపీస్కూల్ ఉపాధ్యాయుడు ఎస్.పోతురాజు, వేణుగోపాలపురం హైస్కూల్ ఉపాధ్యాయుడు ఆర్.నిరంజన్‌ని ఎంఈవోలు టీవీఎం రాందాస్, విశ్వనాథపల్లి శ్రీనివాసరావు సత్కరించారు.

వరద బాధితులకు పరామర్శ



కె. కొత్తపాలెంలో వరద బాధితులను పరామర్శిస్తున్న ఆర్డీవో వాణి

కె. కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె. కొత్తపాలెంలో వరద బాధితులను ఎమ్మెల్యే మండలి బుద్ద ప్రసాద్ గురువారం పరామర్శించారు. బుర్రె సువర్ణ అనే వృద్ధురాలు తనకు ఎవ్వరూ లేరని, వరద సమయంలో పునరావాస కేంద్రంలో ఉండటం వద్ద ఇంట్లోని డాక్యుమెంట్స్, ఆధార్, రేషన్ కార్డులన్నీ కొట్టుకుపోయాయని విలపిస్తూ ఎమ్మెల్యేకు మొరపెట్టుకుంది. సర్టిఫికెట్లు తెప్పిస్తామని అధైర్య పడవద్దని చెప్పారు. సామాన్లు పూర్తిగా పాడైపోయాయని, బురదమట్టి కూడా పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, రావి రత్నగిరి, పూషడపు రత్నగోపాల్ తహసీల్దార్ శ్రీవిద్య, ఎంపీడీవో కె శ్రీనివాసరావు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు. బొబ్బర్లంక వరదబాధితులను మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి పరామర్శించారు. బాధితులకు అందిస్తున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. వరద ముంపు గ్రామాల్లో చేరిన మురుగు తొలగించి, భోజనం మంచినీళ్లు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయా గ్రామ సర్పంచులు కొక్కిలిగడ్డ మాధవి, దొప్పలపూడి గంగాభవానీ, రావి రత్నగిరి, కూరేటి మాధవ, కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఔదార్యం అభినందనీయం



కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి (మచిలీపట్నం):వరద బాధితుల సహాయం కోసం విద్యార్థులు ఔదా ర్యం చూపి ఆర్థిక సహాయం అందజేయటం అభినందనీయమని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో పెనమలూరు నియోజకవర్గం కానూరుకు చెందిన షామిరాక్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు రూ. 3 లక్షల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు చాలా నష్టం వాటిల్లిందని, వరద బాధితులను ఆదుకునే ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులు ముందుకు రావటం అభినందించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు అందజేసిన బ్యాంక్ చెక్కును ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ డీఆర్వో శ్రీదేవికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షురాలు మౌనిక సుమన్, ప్రిన్సిపాల్ భారతి, వైస్ ప్రిన్సిపాల్ తుషారా, విద్యార్థులు పాల్గొన్నారు.

అటెండెన్సు ఫుల్... బయోమెట్రిక్ నిల్



రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న మున్సిపల్ ఉద్యోగి రాజేశ్వరరావు

పెడన: సచివాలయ ఉద్యోగులు ఇష్టానుసారంగా నడుచుకుంటున్నారని, మండల స్థాయి ఉన్నతాధికారులు ఫ్లడ్ డ్యూటీలకు వెళ్లడంతో సచివాలయాల్లోని సిబ్బందిలో కొందరు అటెండెన్సు రిజిస్టరు పుస్తకంలో మాత్రం సంతకాలు చేసి వెళ్లిపోతున్నారు. క్షేత్రస్థాయిలో విధులుంటే వాటికి సంబంధించి మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. కేవలం అటెండెన్సు రిజిస్టరుకు మాత్రమే పరిమితం కావడం, బయోమెట్రిక్ అటెండెన్సు వేయకపోవడం, మూమెంట్ రిజిస్టరు నిర్వహించకపోవడం వంటివి గురువారం అధికారుల తనిఖీలో బయటపడ్డాయి. గురువారం సాక్షి దినపత్రికలో పట్టణంలోని రెండో సచివాలయం, మండలంలోని నడుపూరు సచివాలయంలో సిబ్బంది లేకపోవడాన్ని ఫోటోలు ప్రచురితమయ్యాయి. దీనిపై ఇటు మున్సిపల్ అధికారులు ఆయా వార్డుల్లోని తొమ్మిది సచివాలయాలకు సంబంధించి అటెండెన్సు రిజిస్టరులతో పాటు మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. మూమెంట్ రిజిస్టరు తప్పులు తడకలుగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే మండలంలో ఏ గ్రామ సచివాలయం కూడా బయోమెట్రిక్ అటెండెన్సు వేయకపోవడాన్ని సీరియస్‌గా తీసుకుని ఆయా సచివాలయాలకు సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. సక్రమంగా విధులకు హాజరుకాని పలువురు సచివాలయల ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేయనున్నట్లు సమాచారం.